సాక్షి విజయనగరం

శుక్రవారం । 16 । జూన్ । 2023



రైల్వేకు భారీగా ఆదాయం

విజయనగరం జిల్లా నుంచి మామిడి ఎగుమతులు ఈ ఏడాది రైల్వేశాఖకు భారీగా ఆదాయం తెచ్చిపెట్టాయి. - 8లో



పుణ్యక్షేత్రాల దర్శనం

ఈస్ట్‌కోస్ట్ రైల్వే భారత్ గౌరవ్ యాత్ర పేరుతో పుణ్యక్షేత్రాల దర్శన భాగ్యం కల్పిస్తోంది. - 8లో



మాదక ద్రవ్యాలకు బానిస కావద్దు

మాదక ద్రవ్యాలకు బానిసై యువత జీవితాలను చిత్తు చేసుకోవద్దని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హితవు పలికారు. - 8లో

న్యూస్‌రీల్

48 కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు (వెనుక ముసుగులో నిందితుడు, స్వాధీనం చేసుకున్న గంజాయి)

విజయనగరం క్రైమ్: విజయనగరం రైల్వేస్టేషన్ వద్ద బుధవారం రాత్రి పోలీసులు జరిపిన తనిఖీల్లో 48 కిలోల గంజాయి పట్టుబడింది. సీఐ బి.వెంకటరావు స్థానిక విలేకరులకు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వేస్టేషన్ వద్ద ఒడిశాలోని జైపూర్‌కు చెందిన సూరజ్‌నారాయణ్‌పాడి బ్యాగుతో అనుమానాస్పందంగా తిరుగుతుండగా పోలీసులు తనిఖీ చేశారు. బ్యాగులో గంజాయి ఉండడంతో అదుపులోకి తీసుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు అశోక్ కుమార్, మురళి పాల్గొన్నారు.

తోటపల్లి కాలువకు గండి



గండిపడిన ప్రాంతం

బొబ్బిలి: తోటపల్లి కుడి ప్రధాన కాలువకు మండలంలోని అలజంగి వద్ద గురువారం గండి పడింది. అలజంగి గ్రామం దాటిన తరువాత పాల్తేరు వెళ్లే దారిలో గండిపడడంతో సాగునీరు వృథా అవుతోంది. మూడు రోజుల కిందట తోటపల్లి కాలువకు సాగునీరు విడుదల చేశారు. ఎండల తీవ్రతకు గట్టు బీటలు వారడం, మట్టి లూజు కావడంతో గండిపడినట్టు ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. తోటపల్లి డీఈఈ టి.రఘునాథరావు గండి పడిన ప్రాంతాన్ని తన సిబ్బందితో సందర్శించారు. యంత్రాలతో గండిని పూడ్చే చర్యలు చేపట్టారు. శుక్రవారం నాటికి గండి పూర్తిగా పూడ్చివేసి సాగునీటి పారుదలకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూస్తామని డీఈఈ తెలిపారు.

ఐసెట్‌లో మెరిసిన జ్యోతి స్వరూప్



తెర్లాం: ఏపీ ఐసెట్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో తెర్లాం మండలం చిన్నయ్యపేటకు చెందిన చింత జ్యోతిస్వరూప్ రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంక్‌ను సాధించాడు. ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు కోసం మే నెలలో నిర్వహించిన ఐసెట్ పరీక్ష ఫలితాలను ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. ఇందులో జ్యోతి స్వరూప్ 161.9724 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో నాలుగో ర్యాంక్‌ను కైవసం చేసుకున్నాడు. ఆయన తండ్రి చింత శంకరరావు రీజనింగ్ ఫ్యాకల్టీగా కోచింగ్ సెంటర్‌లో పనిచేస్తుండగా, తల్లి అరుణ గృహిణి. విశాఖపట్నంలోని గాయత్రి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేసిన కుమారుడు ఐసెట్‌లో మంచి ర్యాంకు సాధించడంతో తల్లిదండ్రులు సంతోష పడుతున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

విజయనగరం టౌన్: ఆర్టీసీ డిపో పరిధిలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తామని డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిసర ప్రాంతాల ప్రయాణికుల సమస్యలను సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు స్వీకరిస్తామన్నారు. సమస్యలను తెలియజేసే ప్రయాణికులు సెల్: 99592 25620 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఐటీఐ ప్రవేశాలకు 108 మంది హాజరు



కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

విజయనగరం రూరల్: జిల్లాలోని పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లలో 2023 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు బుధవారం నుంచి ప్రారంభమైన కౌన్సెలింగ్‌కు తొలి రోజు 81 మంది హాజరుకాగా, రెండో రోజు గురువారం 108 మంది హాజరయ్యారు. రెండోరోజు 254 నుంచి 576 వరకు ర్యాంకులు పొందిన అభ్యర్థులను కౌన్సెలింగ్‌కు పిలవగా 108 మంది హాజరు కాగా, వీరిలో 66 మందికి ప్రవేశ పత్రాలు అందించినట్టు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ టీవీ గిరి తెలిపారు.

ప్రపంచంతో పోటీపడేలా.. ఊరిబడిలో విద్యాబోధన

- సర్కారుబడుల విద్యార్థులను గ్లోబల్ సిటిజన్లుగా తయారుచేయడమే ముఖ్యమంత్రి లక్ష్యం
- ఒకటి నంచి ఇంటర్మీడియట్ వరకు డిజిటల్ విద్యాబోధన
- డిసెంబర్ 21న ఎనిమిదో తరగతి పిల్లలకు ట్యాబ్‌లు
- చదువులో పోటీతత్వం పెంపొందించేందుకే జగనన్న ఆణిముత్యాలు కింద పురస్కారాల ప్రదానం
- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



పదోతరగతిలో చీపురుపల్లి నియోజకవర్గ స్థాయి టాపర్లుగా నిలిచిన మీసాల లావణ్య, ఇప్పిలి నీలావతిని సత్కరిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు

చీపురుపల్లి:

ప్రపంచంతో పోటీపడేలా సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యాబోధన సాగుతుందని, భవిష్యత్తులో గ్లోబల్ సిటిజన్లుగా తయారు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్ససత్యనారాయణ అన్నారు. చీపురుపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం ఏర్పాటుచేసిన నియోజకవర్గ స్థాయి జగనన్న ఆణిముత్యాలు పురస్కార ప్రదానోత్సవంలో ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గ స్థాయిలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు పురస్కారంలో భాగంగా వరుసగా రూ.15వేలు,



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

రూ.10వేలు, రూ.5వేలు చొప్పున నగదు పారితోషికం, మెడల్, ధ్రువీకరణ పత్రం అందజేశారు. అంతకు ముందు ఆయన మాట్లాడుతూ ఊరిబడిలో చదువుతున్న విద్యార్థుల్లో చదువులో పోటీ తత్వాన్ని పెంపొందించేందుకు జగనన్న ఆణిముత్యాలు పేరుతో పురస్కారాలు అందజేస్తున్నట్టు చెప్పారు. గతంలో ఎన్నడూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ఉత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థులకు ప్రభుత్వం నుంచి ఇలాంటి ప్రోత్సాహకాలు అందించిన పరిస్థితి లేదన్నారు. విద్యార్థుల చదువుల కోసం ఎంతైనా ఖర్చు చేసేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థి ప్రతీరోజూ పాఠశాలకు వచ్చి క్రమశిక్షణతో చదువుకునేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు బాధ్యత వహించాలన్నారు. ప్రస్తుత కాలంలో ప్రపంచమంతా డిజిటల్ విధానంలోకి వెళ్లిపోయిన నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు డిజిటల్ విధానం క్షేత్ర స్థాయి నుంచే అలవాటు చేసేందుకు డిజిటల్ విద్యా బోధనను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. అనంతరం చీపురుపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఇంటరాక్టివ్ లెర్నింగ్ ప్యానెల్‌ను ఆయన ప్రారంభించారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు తరగతి గదుల్లో ఇంటరాక్టివ్ లెర్నింగ్ ప్యానల్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే 1327 ఇంటరాక్టివ్ లెర్నింగ్ ప్యానల్‌లు ఏర్పాటుచేసినట్టు వెల్లడించారు.

విద్యారంగంలో ఎన్నో మార్పులు

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో ఎన్నో మార్పులు తీసుకొచ్చారని కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్ అన్నారు. పాఠశాలలకు వచ్చే పిల్లలకు విద్యాకానుక కిట్లు అందించడంతో పాటు మంచి పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులు చదువులో బాగా రాణించాలని కోరారు. పిల్లలు మరింత ఆరోగ్యంగా రూపొందాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం గోరుముద్ద కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, పలాస నియోజకవర్గ పరిశీలకుడు కె.వి. సూర్యనారాయణరాజు, చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల ఎంపీపీలు ఇప్పిలి వెంకటనర్సమ్మ, మీసాల విజయలక్ష్మి, తాడ్డి కష్ణవేణి, పొట్నూరు ప్రమీల, చీపురుపల్లి, గరివిడి, గుర్ల జెడ్పీటీసీ సభ్యులు వలిరెడ్డి శిరీష, వాకాడ శ్రీనివాసరావు, శీర అప్పలనాయుడు, ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్దనరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, మీసాల విశ్వేశ్వరరావు, తాడ్డి వేణు, పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, డీఈఓ లింగేశ్వరరెడ్డి, ఆర్డీఓ ఎం.అప్పారావు, చీపురుపల్లి, గరి విడి ఎంఈఓలు భానుప్రకాష్, రామారావు, పాఠశాల హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



నగదు పురస్కారాలు అందుకుంటున్నవారిని చప్పట్లతో అభినందిస్తున్న చిన్నారులు

ప్రభుత్వ విద్యకు పెద్దపీట....

రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ప్రజాసంకల్పయాత్రలో ప్రభుత్వ పాఠశాలల దుస్థితిని తెలుసుకున్నారని, అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పిస్తున్న ఏకైక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందన్నారు.

నాడు–నేడు, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద వంటి కార్యక్రమాలతో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కల్పిస్తున్న సదుపాయాలు, సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

గిరిజన గూడల్లో డిజిటల్ విప్లవం



సెల్‌టవర్లు ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, కలెక్టర్ నిషాంత్‌కుమార్, గిరిజనులు

గుమ్మలక్ష్మీపురం: మొబైల్ టవర్ల ప్రారంభంతో గిరిజన గ్రామాల్లో డిజిటల్ విప్లవం వస్తుందని, ఇది గొప్ప మార్పుకు నాంది పలకనుందని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో నిర్మాణం పూర్తయిన మొబైల్ టవర్లను వర్చువల్ విధానంలో గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా గుమ్మలక్ష్మీపురం మండలం కుక్కిడి పంచాయతీ శిఖలబాయి గ్రామంలో గిరిజనులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. సాంకేతిక మార్పును అందిపుచ్చుకోవాలని కోరారు. ప్రజలకు మరింత మంచి జరగాలని ఆయన ఆకాంక్షించారు. డిసెంబర్ నాటికి అన్నిటవర్ల నిర్మాణం పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి సీఎంతో మాట్లాడారు. గిరిజన ప్రాంతంలో విద్యా, వైద్యం వంటి ప్రాథమిక అవసరాలు తీరుస్తుండడంతో పాటు కమ్యూనికేషన్ సదుపాయం కల్పిస్తూ గిరిజనాభివృద్ధికి కట్టుబడిన ముఖ్యమంత్రిగా, ప్రతి ఆలోచన గిరిజనుల అభివృద్ధిపైనే ఉండడం సంతోషదాయకమన్నారు. ఇప్పటికే నాడు–నేడు పనులతో పాఠశాలలు, ఆస్పత్రుల రూపురేఖలు మారాయన్నారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ, అనేక సంక్షేమ పథకాలు అమలుతో ప్రజలగుండెల్లో చోటుసంపాదించుకున్నారన్నారు. మీ మేలును మా గిరిజనం మరచిపోదన్నారు. కలెక్టర్ నిషాంత్‌కుమార్ మాట్లాడుతూ మొబైల్ టవర్ల ఏర్పాటుతో జిల్లా వ్యాప్తంగా 4జీ కవరేజ్ వస్తుందని, జిల్లాలో నూతన శకం ప్రారంభం అవుతుందన్నారు. రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో ఏర్పాటు చేయాల్సిన 52 టవర్లకు ఒకేసారి అటవీశాఖ అనుమతులు మంజూరు చేశామన్నారు. ఒక్కో టవర్ ఏర్పాటుకు రూ.80 లక్షల వరకు ఖర్చు చేస్తున్నట్టు వెల్లడించారు. జిల్లాలో రూ.135 కోట్ల ఖర్చుతో టవర్ల నిర్మాణం పనులు జరుగుతున్నాయని తెలిపారు. మొబైల్ వినియోగదారురాలైన గిరిజన మహిళ పాలక సంధ్య ముఖాముఖీలో ముఖ్యమంత్రితో మాట్లాడుతూ టవర్లను ఇచ్చి బయట ప్రపంచంతో గిరిజనులను పరిచయం చేశారన్నారు. సిగ్నల్స్ రాకతో ప్రపంచంతో సంబంధం ఏర్పడిందని, ఎప్పటి సమాచారం అప్పుడే తెలుస్తోందని చెప్పారు. గతంలో గర్భిణీలు ప్రసవ సమయంలో ఏమి చేయాలో తెలిసేది కాదని, అంబులెన్స్‌కు పిలు చుకువచ్చేసరికి ప్రసవం జరిగిపోయేదని, ఇప్పు డు 108కి ఫోన్ చేయొచ్చని, ఆస్పత్రికి తీసుకెళ్లాక ప్రసవం అయితే తల్లీబిడ్డ క్షేమ సమాచారం కూడా ఫోన్లోనే తెలుసుకోవచ్చంటూ ఆనందం వ్యక్తంచేశారు. సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా ఉండాలని ఆకాంక్షిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్ కుమార్, గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఎంపీపీలు పాల్గొన్నారు.

దిశ యాప్‌తో మహిళలకు రక్షణ



గొల్లాం గాయత్రి పాఠశాల వద్ద దిశ యాప్‌ను డౌన్‌లోడు చేయిస్తున్న పోలీసులు, ఎంఎస్‌పీలు

విజయనగరం క్రైమ్: దిశ యాప్‌తో మహిళలకు రక్షణ ఉంటుందని ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు, మహిళా పోలీసులు, మహిళా రక్షక్, ఇతర పోలీస్ సిబ్బంది గురువారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. తమ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్య కూడళ్లు, ఉన్నత పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. మహిళల ఫోన్లలో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. జిల్లాలో ఇప్పటివరకు 8 లక్షల మందికి పైగా యాప్‌ను డౌన్‌లోడ్ చేయించుకున్నారని, 4 లక్షల 80వేల మందితో రిజిస్ట్రేషన్ చేయించినట్టు ఎస్పీ తెలిపారు.

20న వైద్య సిబ్బంది పోస్టులకు ఇంటర్వ్యూ

విజయనగరం ఫోర్ట్: ఎన్‌హెచ్‌ఎం విభాగంలోని ఎస్‌ఎన్‌సీయూలో ఖాళీగా ఉన్న 2 పిడియాట్రిసిన్ పోస్టులు, ఆడియాలజిస్టు పోస్టు–1, డెంటల్ టెక్నీషియన్ పోస్టు–1కి ఈ నెల 20వ తేదీన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఇంటర్వ్యూ నిర్వహిస్తామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజనల్ ధ్రువపత్రాలతో పాటు జెరాక్సు కాపీలపై గజిటెడ్ ఆఫీసర్‌తో సంతకం చేయించి తీసుకురావాలన్నారు. పిడియాట్రిసిన్ పోస్టుకు జీతం రూ.లక్ష, ఆడియాలజిస్టుకు రూ.30 వేలు, డెంటల్ టెక్నీషియన్‌కు రూ.18 వేలు జీతం ఉంటుందని పేర్కొన్నారు.

నేత్ర వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ





హాజరయిన వైద్యాధికారులు, కంటి ఆస్పత్రి ప్రతినిధులు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

- రోజువారీ కంటి పరీక్షలు పెరగాలి
- కళ్లద్దాల పంపిణీ పూర్తి కావాలి
- 'వైఎస్సార్ కంటి వెలుగు'పై సమీక్షించిన కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: 'వైఎస్సార్ కంటివెలుగు' కార్యక్రమంలో రోజువారీ నేత్ర పరీక్షలను నిర్దేశిత లక్ష్యం మేరకు పూర్తిచేయాలని కలెక్టర్ నాగలక్ష్మి నేత్రవైద్య సహాయకులను ఆదేశించారు. కంటి పరీక్షలు చేయడంలో గ్రామ, వార్డు వలంటీర్లు సహకరించేలా ఆదేశాలు ఇస్తామన్నారు. ఇప్పటికే కంటి పరీక్షలు పూర్తయిన వారికి కళ్లద్దాల పంపిణీని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో నేత్ర పరీక్షలపై గురువారం సమీక్షించారు. జిల్లాలో కంటి వెలుగులో గుర్తించిన 5 వేల మందికి నిర్ధిష్ట వ్యవధిలో శస్త్రచికిత్సలు పూర్తిచేయాలన్నారు. కళ్లద్దాల పంపిణీలో వైద్యాధికారుల సహకారం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కంటి చికిత్సలు చేయించుకునే వారికి రవాణా సౌకర్యం కల్పిస్తే ఎక్కువ మందికి ప్రయోజనం కలుగుతుందని పుష్పగిరి, శంకర్ ఫౌండేషన్ తదితర ఆస్పత్రుల ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

జిల్లాలో కంటివెలుగు కార్యక్రమంలో సాధించిన ప్రగతిని ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ శివప్రసాద్ వివరించారు. జిల్లాలో 8 బృందాలు నేత్ర పరీక్షలు చేస్తున్నట్టు తెలియజేశారు. కంటివెలుగు కార్యక్రమానికి వైద్య ఆరోగ్య శాఖ క్షేత్రస్థాయి సిబ్బంది సహకారం అందించేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ భాస్కరరావును కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో తారక్, ఆప్తాలమిక్ అసిస్టెంట్లు, అనిల్ నీరుకొండ, షాలోమ్ కంటి ఆస్పత్రి ప్రతినిధులు పాల్గొన్నారు.

మందుల కొనుగోలుకు రెట్టింపు బడ్జెట్

- గతంలో 3 నెలలకు మందుల బడ్జెట్ రూ.43 లక్షలు
- ప్రస్తుతం రూ.1.10 కోట్ల చెల్లింపు
- సర్జికల్ బడ్జెట్ గతంలో 3 నెలలకు రూ.13 లక్షలు
- ప్రస్తుతం రూ.94 లక్షలు
- ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో అందుబాటులో 492 రకాల మందులు
- 326 రకాల సర్జికల్ మెటీరీయల్ అందజేత



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

విజయనగరం ఫోర్ట్: జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోంది. నాడు–నేడు పనులతో ప్రభుతాస్పత్రులకు ఆధునిక సొబగులు అద్దుతోంది. రోగులకు మెరుగైన వైద్యసేవలందించేందుకు వీలుగా అన్ని అస్పత్రులకు ఆధునిక వైద్య పరికరాలను సమకూర్చింది. అవసరమైన వైద్యులు, సిబ్బందిని నియమించింది. తాజాగా జిల్లాలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగులకు అవసరమైన మందుల కొనుగోలుకు కేటాయించే బడ్జెట్‌ను రెట్టింపుచేసింది. సర్జికల్ బడ్జెట్‌ను అమాంతం పెంచింది. ప్రభుత్వ నిర్ణయంతో రోగులకు పూర్తిస్థాయిలో మందులు అందనున్నాయని ఆస్పత్రి వైద్యులు చెబుతున్నారు.

పెరిగిన బడ్జెట్ ఇలా..

సర్వజన ఆస్పత్రిలో రోగులకు 492 రకాల మందులను అందజేస్తారు. పారాసిట్‌మాల్, సిట్రజిన్, డైక్లోఫినిక్, సెఫిక్సిజమ్, ఎమాక్సిలిన్, ఎమాక్సిక్‌లెవ్, రెంటాక్, పెంటాప్, ఎవిల్, ఎటినిలాల్, ఆమిప్లిడిన్ తదితర మందులను అందజేస్తారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి గతంలో మూడునెలల కాలానికి మందుల కొనుగోలుకు రూ.43 లక్షలు చెల్లిస్తే.. దీనిని రూ.1.10 కోట్లకు ప్రభుత్వం పెంచింది. అలాగే, సర్జికల్ మెటీరియల్ బడ్జెట్ గతంలో క్వార్టర్ (3 నెలలు)కు రూ.13 లక్షలు ఉంటే ఇప్పుడు దానిని రూ.94 లక్షలకు ప్రభుత్వం పెంచింది. 326 రకాల సర్జికల్ మెటిరియల్స్‌ను ప్రభుత్వం సమకూర్చుతోంది. గ్లౌజులు, కాటన్, బ్యాండేజ్, ఆయింట్ మెంట్స్, సిరంజులు, నీడిల్స్, ఆపరేషన్ థియేటర్‌లో ఉపయోగించే క్లాత్‌లు, ఇతర డ్రెస్సింగ్ మెటీరియల్ తదితర సర్జికల్ సామగ్రిని ప్రభుత్వం అందిస్తోంది.

ఏడాదికి 3.74 లక్షల ఓపీ

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఏడాదికి 3,74,711 మంది ఔట్ పేషెంట్‌లు, 39,919 మంది ఇన్‌పేషెంటలు సేవలు పొందుతున్నారు. మేజర్ ఆపరేషన్లు 4,601, కుటుంబ సంక్షేమ శస్త్రచికిత్సలు 737, ప్రసవాలు 4,991 జరిగాయి. అల్ట్రాసౌండ్ స్కాన్‌లు 14,776, ఎక్సరేలు 24,182, ఈసీజీలు 16,885 మందికి తీశారు. వైద్య పరీక్షలు 5,97,669 మందికి చేశారు.



ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్



రోగులకు మందులు అందజేస్తున్న ఫార్మసిస్టు

బడ్జెట్ పెరిగింది

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి అవసరమైన మందులు, సర్జికల్ పరికరాల కొనుగోలుకు గతంలో ఇచ్చిన దాని కంటే ప్రభుత్వం బడ్జెట్‌ను సుమారుగు రెండు రెండ్లు పెంచింది. 3 నెలలకు ఇచ్చిన బడ్జెట్ గతంలో కంటే భారీగా పెరిగింది. దీంతో రోగులకు పూర్తి స్థాయిలో మందులు అందుతాయి.

– డాక్టర్ ఎస్.అప్పలనాయుడు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

క్లుప్తంగా

మాదక ద్రవ్యాలకు బానిస కావద్దు

● ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురంటౌన్: మాదక ద్రవ్యాలకు బానిసై యువత జీవితాలను చిత్తు చేసుకోవద్దని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హితవు పలికారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నియంత్రణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఎస్పీ బంగ్లా కూడలి నుంచి బాలాజీ జంక్షన్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల ప్రభావంతో యువత మత్తు బారిన పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. ఇటీవల కాలంలో ఇంజినీరింగ్ విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ కేసుల్లో నేరస్తులుగా నమోదవుతున్నారని చెప్పారు. జల్సాలకు అలవాటు పడిన యువత డబ్బుల కోసం నేరాలకు పాల్పడి, జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వెలిబుచ్చారు. డ్రగ్స్‌కు అలవాటుపడిన వారి మెదడు మొద్దుబారి, తాము ఏమి చేస్తున్నామనే విషయాన్ని మరిచిపోయి, విచక్షణ కోల్పోయి, తల్లిదండ్రులను ఎదురిస్తూ, ప్రేమ పేరుతో బాలికల్ని వేధిస్తూ, పోక్సో కేసుల్లో నిందితులుగా మారుతున్నారని వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీ అనిల్‌కుమార్, ఎఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, పట్టణ సీఐలు జె.మురళి, సీహెచ్ శ్రీనివాసరావు, రూరల్ సీఐ టీఎస్ మంగవేణి, ఎస్సైలు, ఏఎస్సైలు, మహిళా సంరక్షక పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్రలలోడ్ సీజ్



అక్రమంగా తరలిస్తున్న కలపను స్వాధీనం చేసుకున్న అటవీశాఖ అధికారులు

గరుగుబిల్లి/కురుపాం: గరుగుబిల్లి మండలంలోని తోటపల్లి నుంచి రాజాం పట్టణానికి ట్రాక్టర్‌తో పాసికర్రను తరలిస్తుండగా కురుపాం ఫారెస్ట్ రేంజర్ ఆర్. రాజుబాబు సిబ్బందితో కలిసి బుధవారం రాత్రి పట్టుకున్నారు. తోటపల్లి, ఖడ్గవలస గ్రామాల పరిధిలో పట్టుకున్న ట్రాక్టర్‌ను తదుపరి చర్యల నిమిత్తం కురుపాం అటవీశాఖ కార్యాలయానికి తరలించినట్లు రేంజర్ రాజుబాబు తెలిపారు. పట్టుకున్న కర్రల విలువ సుమారు రూ.1.70 లక్షలు ఉంటుందని చెప్పారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

పూసపాటిరేగ: అక్రమంగా తరలిస్తున్న పది క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని మండలంలోని సుందరపేట జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ మురళి గురువారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా బియ్యం తరలిస్తున్న వ్యాన్ డ్రైవర్ పి.మురళి, పోలిపల్లి సతీష్‌లపై 6ఏ కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. సీజ్ చేసిన బియ్యాన్ని భోగాపురం పౌరసరఫరాల గొడౌన్‌కు తరలించినట్లు చెప్పారు.

పేరాపురం గొడౌన్‌లో 20 క్వింటాళ్లు..

పూసపాటిరేగ: మండలంలోని పేరాపురం నుంచి కొప్పెర్ల వెళ్లే రహదారిలో అక్రమంగా నిల్వ ఉంచిన 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్ చేసినట్లు పౌరసరఫరాల అధికారి మురళి తెలియజేశారు. శ్రీకాకుళం విజిలెన్స్ సీఐ సింహాచలంతో కలిసి బియ్యం సీజ్ చేసినట్లు చెప్పారు. గొడౌన్ యజమాని ఆకి వెంకటేష్‌పై 6ఏ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉపసర్పంచ్ ఆత్మహత్యాయత్నం

బొబ్బిలి: మండలంలోని అలజంగి ఉపసర్పంచ్ పొట్నూరు లక్ష్మునాయుడు గురువారం ఉదయం ఆత్మహత్యాయత్నం చేశాడు. గ్రామంలోని బట్టిగట్టువద్ద ఆయన అపస్మారక స్థితిలో ఉండడాన్ని గుర్తించిన గ్రామస్తులు, కుటుంబసభ్యులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఉదయాన్నే ఆహారం లేకుండా ఖాళీ కడుపుతో ఎక్కువ మోతాదులో గడ్డిమందు తాగడం వల్ల వెంటనే అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయినట్టు గ్రామస్తులు తెలిపారు. ఉపసర్పంచ్ ఇద్దరు కుమారులు బ్యాంకు ఉద్యోగులు కాగా కుమార్తె అమెరికాలో నివాసముంటోంది. అయితే ఆయన ఆత్మహత్యాయత్నానికి దారితీసిన కారణాలు తెలియరాలేదు. ప్రస్తుతం విజయనగరంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని వివరాలు సేకరించి కేసు నమోదు చేస్తామని డీఎస్పీ పుల్లూరు శ్రీధర్, సీఐ ఎం.నాగేశ్వర రావులు తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 550.00
విజయనగరం	రూ. 554.00
శ్రీకాకుళం	రూ. 554.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	59,670-00
బంగారం(22సి. 10గ్రా.)	54,700-00
వెండి (కిలో)	77,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹165	₹300	₹ 310

రైల్వేకు భారీగా ఆదాయం

● 22 రైళ్లకు సమకూరిన రూ.3 మూడు కోట్లు
● ఈ ఏడాది జిల్లా నుంచి 7,911 టన్నుల మామిడి ఎగుమతి



ఢిల్లీకి ఎగుమతి చేస్తున్న మామిడి

విజయనగరం టౌన్: జిల్లానుంచి మామిడి ఎగుమతులు ఈ ఏడాది రైల్వేశాఖకు భారీగా ఆదాయం తెచ్చిపెట్టాయి. ఈస్ట్‌కోస్ట్ రైల్వేపరిధిలో విజయనగరం జిల్లా కేంద్రంగా ఢిల్లీకి ప్రతిఏటా మామిడి ఎగుమతి చేస్తారు. అయితే ఈ ఏడాది ఎగుమతులు గణనీయంగా పెరగడంతో రైల్వేకు భారీగా ఆదాయం సమకూరింది. గత ఏడాది కేవలం 7 రేకుల (రైళ్లు)తో 2016 టన్నులకే పరిమితమైన ఎగుమతులతో రూ.88 లక్షల 30వేల 340 ఆదాయం రైల్వే శాఖకు వచ్చింది. ఈ ఏడాది మామిడి కాపు బాగా ఉండడంతో రైతులు, మేంగో అసోసియేషన్‌లు ముందుకు రాగా ఆదాయం గణనీయంగా పెరిగింది. ఈ ఏడాది ఏప్రిల్ 16 నుంచి జూన్ 11 వరకూ 22 రేక్‌ల (రైళ్లు) ద్వారా 7,911 టన్నుల మామిడి ఎగుమతులు చేశారు. దీంతో రైల్వేశాఖకు రూ.3 కోట్ల 46 లక్షల 50వేల 370 ఆదాయం సమకూరింది. రైల్వేస్టేషన్ మేనేజర్ కె.మురళీకృష్ణ, పార్సిల్ సూపర్‌వైజర్ కేశవ్ కుమార్, ఇన్‌చార్జ్ చీఫ్ పార్సిల్ సూపర్‌వైజర్ డీఎస్.బాబు, చీఫ్ కమర్షియల్ మేనేజర్ ఎస్‌వీజీ.ప్రసాదరావుల స్వీయ పర్యవేక్షణలో జిల్లా నుంచి మామిడి ఎగుమతులు సజావుగా జరగడంతో అసోసియేషన్ ప్రతినిధులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


సమష్టి కృషితోనే సాధ్యం

రైల్వేశాఖలో ఉద్యోగుల సమష్టి కృషితోనే మామిడి ఎగుమతులు ఈ ఏడాది బాగా చేయగలిగాం. గతేడాది కంటే ఈ ఏడాది పంట బాగా పండడంతో పాటు రైతులు ఎగుమతులపై మక్కువ చూపడం ఆనందించదగిన విషయం. రైల్వేశాఖ మామిడి ఎగుమతులపై ప్రతిష్టాత్మక చర్యలు చేపట్టడం, రైతులు, అసోసియేషన్‌లకు అనువుగా ఉత్పత్తులు సాఫీగా సాగేందుకు అవకాశాలు కల్పించడంతో ఆదాయం సమకూర్చుకోగలిగాం. ఈ ఏడాదికి రైల్వే ద్వారా మామిడి ఎగుమతులు ముగిసినట్లే.



ఎస్‌వీజీ.ప్రసాదరావు, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్

ఆర్‌అండ్‌బీ ఉద్యోగుల కార్యవర్గ సమావేశం



ఆర్‌అండ్‌బీ కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

విజయనగరం రూరల్: ఆర్‌అండ్‌బీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా కృషి చేద్దామని రహదారులు, భవనాల శాఖ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు పాపారావు పిలుపునిచ్చారు. రహదారులు, భవనాల శాఖ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం గురువారం సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన పాపారావు మాట్లాడుతూ ఆర్‌అండ్‌బీ శాఖలో ఉద్యోగులకు ఉన్న పదోన్నతులు, జీతాల సమస్యలు, ఈహెచ్‌ఎస్‌లో ఎదురయ్యే సమస్యల పరిష్కారంపై సంఘటితంగా కృషి చేయాల్సిన అవసరముందన్నారు. అలాగే సంఘం అభివృద్ధికి తీసుకుంటున్న నూతన విధానంపై చర్చించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బి.చంద్రశేఖర్, కార్యదర్శి శ్రీనివాసరావు, విశాఖ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, ఇతర కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

భారత్ గౌరవ్ యాత్రలో పుణ్యక్షేత్రాల దర్శనం

విజయనగరం టౌన్: ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఆధ్వర్యంలో భారత్ గౌరవ్ యాత్ర పేరుతో నిర్వహిస్తున్న పుణ్యక్షేత్రాల దర్శనాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఐఆర్‌సీటీసీ ప్రాంతీయ మేనేజర్ చంద్ర మోహన్ బిశా పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక రైల్వేస్టేషన్‌లోని వీఐపీ లాంజ్‌లో బుధవారం ఆయన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూరీ, కోణార్క్, గయ, వారణాశి, అయోధ్య, ప్రయాగరాజ్ ప్రాంతాల యాత్ర తొమ్మిది రోజులు ఉంటుందన్నారు. పెందుర్తి, విజయనగరం నుంచి రైలు బోర్డింగ్ పాయింట్ ఉందని పేర్కొన్నారు. జూన్ 28, జూలై 12, 26 తేదీల్లో రైలు ప్రయాణిస్తుందని చెప్పారు. ప్రయాణికులకు ఐఆర్‌సీటీసీ తక్కువ ధరలకు అవకాశం కల్పిస్తోందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8287932318, 8287932281 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో రైల్వే కమర్షియల్ మేనేజర్ పీఎస్‌పీ.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఐఆర్‌సీటీసీ ప్రాంతీయ మేనేజర్ చంద్ర మోహన్ బిశా, తదితరులు

పీహెచ్‌సీలో నెలకు 10 ప్రసవాలు

● డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: పీహెచ్‌సీల్లో నెలకు 10ప్రసవాలు అయ్యే విధంగా చర్యలు తీసుకున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సాధారణ ప్రసవాలు అన్ని పీహెచ్‌సీల్లో జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటివరకు ప్రసవాలు నిర్వహించని పీహెచ్‌సీలను గుర్తించామని, వాటిలో కూడా ప్రసవాలు జరిగే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పీహెచ్‌సీల్లో కాన్పుగదులను ఆధునీకరించామని చెప్పారు. హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. వారు ప్రసవించేవరకు వరకు నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. అన్ని పీహెచ్‌సీల్లో 24 గంటల పాటు సిబ్బంది అందుబాటులో ఉంటున్నారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని, అధిక సంఖ్యలో రోగులు ఫ్యామిలీ వైద్య శిబిరానికి వస్తున్నారని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

లారీ, స్కార్పియో ఢీ: ముగ్గురికి తీవ్ర గాయాలు

రామభద్రపురం: మండలంలోని ముచ్చర్లవలస పెట్రోల్ బంకు వద్ద ఎదురుగా వస్తున్న లారీని స్కార్పియో కారు ఢీకొనడంతో ముగ్గురు వ్యక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు. గురువారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్‌కు చెందిన ఓ కుటుంబం స్కార్పియో కారులో విశాఖపట్నం వెళ్తోంది. సరిగ్గా ముచ్చర్లవలస పెట్రోల్ బంకు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీని కారు ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఏడుగురిలో అనిల్ నాగు, కైలేశ్వర్, దన్ను రాము తీవ్రగాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108 వాహనంలో బాడంగి సీహెచ్‌సీకి తరలించారు.

పిడుగు పడి వ్యక్తికి..

గజపతినగరం రూరల్: మండలంలోని ముచ్చర్ల గ్రామానికి చెందిన అంపోలు అప్పలనాయుడు (60) పశువులను పొలంలోకి మేతకు తీసుకువెళ్లిన సమయమంలో బుధవారం సాయంత్రం పిడుగుపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో స్థానికులు వెంటనే గజపతినగరం ఆస్పత్రికి తరలించారు. ప్రాణాప్రాయం తప్పిందని, పొట్టపై గాయాలు కావడంతో చికిత్స అందిస్తున్నామని వైద్యులు తెలిపారు.

ఆన్‌లైన్, నోటీస్ బోర్డులో పోస్టుల భర్తీ జాబితా

విజయనగరం పూల్‌బాగ్: జిల్లాలోని కేజీబీవీల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి సంబంధించి మొత్తం అభ్యర్థుల జాబితా ఆన్‌లైన్, సమగ్ర శిక్ష కార్యాలయం నోటీస్ బోర్డులో పొందుపరిచినట్లు సమగ్ర శిక్ష ఏపీసీ బి.లింగేశ్వరరెడ్డి గురువారం తెలిపారు. జాబితాలో అభ్యర్థులకు ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే ఈనెల 16లోగా జిల్లా కార్యాలయానికి తెలియజేయలని సూచించారు. ఇంకా ఏవైనా సందేహాలు ఉంటే ఫోన్ 7396999102 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త..!

● మందస్తు చర్యలు చేపడుతున్న మలేరియా నివారణ, వైద్యశాఖ
● 58 ఆశ్రమ, గురుకుల వసతిగృహాల్లో ఏసీఆర్ ద్రావణం పిచికారీ
● ఈనెల 16 వరకు విస్తృతంగా దోమల నివారణకు స్ప్రేయింగ్
● పీహెచ్‌సీల్లో అందుబాటులో మందులు



ఆస్పత్రిలో రోగులు



మల్లి వసతి గృహంలో ఏసీఎం స్ప్రేయింగ్ చేస్తున్న సిబ్బంది

సీతంపేట: జూన్ నెల వచ్చిందంటే వైద్య పరిభాషలో ఎపిడమిక్ సీజన్ ప్రారంభమైందని అర్థం. మన్యంలో విస్తృతంగా వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉంది. రాబోయే ఆరు నెలలు ఎటువంటి వ్యాధులు ప్రబలకుండా మలేరియా నివారణ, వైద్యశాఖ విస్తృతంగా ముందస్తు చర్యలు చేపట్టాయి. ఇప్పటికే అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న ప్రజలు జ్వరాల తీవ్రతతో బాధపడుతూ పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలకు అధికసంఖ్యలో రోజురోజుకూ వస్తున్నారు. మలేరియా నివారణ శాఖ ఆధ్వర్యంలో వ్యాధి కారక దోమల లార్వాను నశింపజేసే ఆల్ఫా సైఫర్ మెత్రిన్, సింథటిక్ ద్రావణాన్ని జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలు, గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు ఉండే వసతిగృహాలు, వాటి పరిసరాల్లో విస్తృతంగా పిచికారీ చేస్తున్నారు. ఈ ప్రక్రియ ఈనెల 16 వరకు జరగనుంది. గతనెల 15 నుంచి 26 వరకు ఇళ్లల్లో మొదటి రౌండ్ స్ప్రేయింగ్ కార్యక్రమం పూర్తయింది. వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందేనని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వాతావరణంలో సంభవిస్తున్న మార్పుల నేపథ్యంలో అపరిశుభ్రత నెలకొని వ్యాధులు ప్రబలే ఆస్కారముంది. ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రధానంగా మలేరియా, టైఫాయిడ్, డెంగీ, అతిసార వ్యాధులతో ప్రమాదం పొంచి ఉంది.వీటి నివారణకు అధికారులతో పాటు ప్రజలు కూడా బాధ్యతగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. వర్షాకాలంలో చిన్నారులకు కూడా ఎక్కువగా వ్యాధులు సోకే ఆవకాశం ఉందని, కనీస జాగ్రత్తలు పాటిస్తే వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని వైద్యులు హితవు పలుకుతున్నారు. వ్యాధుల నివారణకు అవసరమైన మందులన్నీ పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉన్నాయని చెబుతున్నారు.

ముందస్తు జాగ్రత్తలు..

దోమకాటుకు గురికాకుండా దోమతెరలు వాడాలి. ఇంటిలోపల, బయట నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలి. నీటి తొట్టెలను వారానికి ఒకసారి శుభ్రం చేసుకోవాలి. ఇంటిపై వాటర్ ట్యాంకులకు మూతలు బిగించాలి. సెప్టిక్ ట్యాంక్ గాలి గొట్టాలకు ఇనుప జాలీ బిగించాలి ఇంటి ఆవరణలో నీరు నిల్వ లేకుండా చూడాలి. ఇంటి ఆవరణలో నీరు నిల్వ ఉండేందుకు వీలుగా ఉన్న వాటిని (వాడిపడేసిన కొబ్బరి బొండాలు,టైర్లు) వెంటనే తొలగించాలి.

వెంటనే ఆస్పత్రికి..

సురక్షితమైన నీటిని తాగాలి. జ్వరం వచ్చిన వెంటనే ఆస్పత్రికి వెళ్లి రక్త పరీక్షలతో పాటు చికిత్స చేయించుకోవాలి.బహిరంగ మలవిసర్జనకు స్వస్తి పలికి వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించాలి.

క్లోరినేషన్‌కు చర్యలు

ఈ సీజన్‌లో టైఫాయిడ్, మలేరియా, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే ఆస్కారమున్నందున క్లోరినేషన్ ప్రక్రియ, మలేరియా నివారణ కార్యక్రమాలు చేపడుతున్నాం. ముఖ్యంగా శానిటేషన్ చేపట్టాలని సిబ్బందిని ఆదేశించాం.

విజయపార్వతి, డిప్యూటీ డీఎంహెచ్‌వో, సీతంపేట

అప్రమత్తం అవసరం

ఈ సీజన్‌లో వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. వర్షాకాలంలో కలుషిత నీటిని తాగితే టైఫాయిడ్, కామెర్లు వంటి ప్రమాదకర వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. ఆహార పదార్థాలపై మూతలు ఉంచాలి. తాజా వేడి పదార్థాలు తీసుకోవడం మేలు.

బి.శ్రీనివాసరావు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్

నాడు-నేడు పనులు వేగవంతం చేయాలి

● జేసీ మయూర్ అశోక్

మెంటాడ: ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న నాడు-నేడు అభివృద్ధి పనులు మరింత వేగవంతం చేయాలని జిల్లా జేసీ కె.మయూర్ అశోక్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మండలంలోని ఆంద్ర గ్రామంలో ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ పనుల్లో నాణ్యత కొరవడుతోందని పాఠశాల అభివృద్ధి పనుల్లో రాజీపడితే బిల్లుల చెల్లింపులు జరగదని స్పష్టం చేశారు. అనంతరం తమ్మిరాజుపేట గ్రామంలోని రైతుభరోసా కేంద్రాన్ని పరిశీలించారు. రాయితీపై స్థానిక రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయన ఆర్బీకేని అద్దె ఇంట్లో నిర్వహించడంపై ఆరా తీశారు. నూతన భవన నిర్మాణం పూర్తయ్యిందని ఎంపీడీఓ చెప్పడంతో భవనం పూర్తయిన ఎందుకు వినియోగంలోకి తీసుకురావడం లేదని ప్రశ్నించారు. కాంట్రాక్టర్‌కు పెండింగ్ బిల్లులు చెల్లించి ఆర్బీకేని వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. అలాగే మండలంలోని లోతుగెడ్డ పంచాయతీ వంకసోమిద గ్రామంలో సమగ్ర భూసర్వేను జేసీ మయూర్ అశోక్ పరిశీలించారు. సర్వే పూర్తయిన గ్రామాల వివరాలను, ఇంకా చేయాల్సిన గ్రామాల వివరాలను తహసీల్దార్ రామకృష్ణను అడిగి తెలుసుకున్నారు.



ఆర్బీకేలో విత్తనాలను పంపిణీ చేస్తున్న జేసీ మయూర్ అశోక్, తదితరులు

ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం



వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పారామెడికల్ ఉద్యోగులు

విజయనగరం: రాష్ట్రంలో కాంట్రాక్ట్ పారా మెడికల్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ మంత్రివర్గం నిర్ణయించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఆ సంఘం ప్రతినిధులు ముఖ్యమంత్రి చిత్రపటానికి గురువారం పాలాభిషేకం చేశారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మేయర్ విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణుల సమక్షంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటంపై పూలవర్షం కురిపించి అనంతరం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ పారామెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న పారామెడికల్ సిబ్బందికి రెగ్యులర్ చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడం ఎంతో సంతోషం కలిగించిందన్నారు.

పదివేల మందికి ఊరట

గత ప్రభుత్వాలకు ఎన్నో వినతులు ఇచ్చినా సమస్య పరిష్కారంలో ముందడుగు పడలేదన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణితో ఎంతోమంది ఉద్యోగులు అనేక అవస్థలను ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ బాధల పట్ల కనికరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెగ్యులరైజేషన్ చేయడంతో జిల్లాలో దాదాపు పదివేల మంది ఉద్యోగులకు ఊరట లభించిందన్నారు. దీంతో ఆనందించిన తామంతా ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతూ వివిధ రకాల ఆనందోత్సాహ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు.

పద్మావతినగర్‌లో చోరీ

విజయనగరం క్రైమ్: స్థానిక రింగురోడ్డు సమీప పద్మావతినగర్ ఐదోలైన్‌లో గుర్తు దొంగలు ఓ ఇంట్లో చొరబడి బీరువాలో ఉన్న నగదు, బంగారంతో పాటు బయట తాళం తీసి ఉన్న కారును కూడా దొంగిలించారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పద్మావతినగర్ ఐదోలైన్‌లో నివాసం ఉంటున్న గండికోట వెంకటసాయి కృష్ణ బుధవారం రాత్రి పదిగంటల వరకూ కింద ఫ్లోర్‌లో కుటుంబ సభ్యులతో ఉన్నారు. భోజనం పూర్తయిన తర్వాత కింద గది తాళం వేసుకుని మేడపైన ఉన్న ఏసీ గదిలోకి వెళ్లిపోయారు. అయితే దుండుగులు తాళాలు పగులగొట్టి గదిలోకి వెళ్లి బీరువాలో ఉన్న తొమ్మిది తులాల బంగారు ఆభరణాలు, రూ.3 లక్షల 87 వేల నగదును చోరీ చేసి ఇంటి బయట తాళాలు తీసి ఉన్న ఆల్టో కారును పట్టుకుని ఉడాయించారు. ఉదయం లేచి చూసేసరికి ఇల్లంతా చిందరవందరగా కనిపించడంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై గణేష్ తెలిపారు.



చోరీ జరిగిన శ్రీ సాయికళ కళ్లజోళ్ల షాపు

ఆప్టికల్ షాప్‌లో..

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డులో ఉన్న శ్రీసాయికళ ఆప్టికల్ షాపులో గురువారం తెల్లవారు జామున చోరీ జరిగింది. అద్దె కోసం షాపులో దాచిన కొంత నగదును తాళాలు పగులగొట్టి దొంగలు పట్టుకెళ్లిపోయారని షాపు యజమాని పాలవెల్లి లబోదిబోమంటున్నాడు. ఆకతాయిగా తిరుగుతూ చెడు అలవాట్ల బారిన పడిన వారు ఈపని చేసి ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు. బాధిత యజమాని గురువారం చూసేసరికి షాపు తెరిచి ఉండడంతో అవాక్కయ్యాడు. గునపంతో పాటు కొన్ని పరికరాలతో చోరీకి పాల్పడిన దొంగలు వాటిని షాపు దగ్గర విడిచిపెట్టి వెళ్లి పోయారని బాధితుడు తెలిపాడు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

విజయనగరం క్రైమ్: స్థానిక దాసన్నపేట సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. గురువారం జరిగిన ఈ సంఘటనపై టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోట్ల మాదప్పవీధికి చెందిన కొయ్యాన రవి (40) దాసన్నపేటకు పనిమీద వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే సమయంలో శ్రీకాకుళం నుంచి విజయనగరం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు విద్యుత్ భవన్ సమీపంలో ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య రామలక్ష్మి, ఇద్దరు పిల్లలు దీపిక, వరుణ్ తేజ్‌లు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై షేక్ శంకర్ తెలిపారు.

వడదెబ్బ తగిలి వృద్ధుడు..

స్థానిక టూటౌన్ పరిధిలో వడదెబ్బకు గురై ఓ వృద్ధుడు మృతిచెందాడు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. భైరిపురంలో నివాసం ఉంటున్న శ్రీరామ్మూర్తి (70) భార్య చనిపోయింది. కుటుంబసభ్యులు ఇల్లు మట్టించడానికి ఆయనను విజయనగరం తీసుకువచ్చారు. బాబామెట్టలో ఈ కార్యక్రమం పూర్తయిన తర్వాత ఆయన తిరిగి తన ఊరికి వెళ్లిపోయేందుకు సిద్ధమయ్యాడు. నెల్లిమర్ల రోడ్డులోని జగన్నాథ పెట్రోల్ బంక్ సమీపానికి వచ్చేసరికి వడదెబ్బ తగలడంతో సమీపంలో ఉన్న పుచ్చకాయలు అమ్మే పాకలోకి వెళ్లి కుప్పకూలిపోయి మృతిచెందాడు. దీంతో స్థానికులు అందించిన సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు

నెల్లిమర్ల: పట్టణానికి చెందిన ఓ వృద్ధుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై పి. నారాయణరావు తెలిపిన వివరాల మేరకు నగరపంచాయతీ పరిధి చిక్కాల వీధికి చెందిన నారు పెద్ద రాము(58) బుధవారం రాత్రి రోడ్డు దాటుతుండగా విజయనగరం నుంచి గుర్ల వైపు వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం స్థానిక మిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.